క్లుప్తంగా

నెక్లెస్‌బండ్‌పై తుప్పలను తొలగించాలి



నెక్లెస్‌బండ్ గట్టును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో వరద నుంచి రక్షణగా నిర్మించిన నెక్లెస్ బండ్ గట్టు మట్టికట్టపై యడ్లగూడెం నుంచి కమ్మర గూడెం వరకు పేరుకుపోయిన తుప్పలను తొలగించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. నెక్లెస్‌బండ్ గట్టును అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. గోదావరి వరదల సమయంలో గట్టుపై రాక పోకలకు వీలుగా ఏర్పాట్లు చేయాలని, మట్టి కట్ట లీకేజీలు ఉన్నచోట కూడా మరమ్మతులు చేయించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, ఏజీఆర్‌బీ ఏఈ సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నృసింహావతారంలో జగన్నాథుడు



నృసింహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్ర వారం జగన్నాథుడు నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా శంఖు, చక్రాలను ధరించి నారసింహుని అవతారంలో ఉన్న స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నూకాలమ్మ ఆలయానికి విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారికి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అభివృద్ధికి రాజమహేంద్రవరానికి చెందిన గుబ్బల ప్రసాద్, రామలక్ష్మి దంపతులు రూ.25,116 విరాళంగా అందించారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. వారికి అమ్మవారి శేష వస్త్రాన్ని, చిత్ర పటాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదంతో సత్కరించామన్నారు. జూలై 2న ఆలయంలో 52వ చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని అర్చకుడు మనోజ్ శర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు



నాటుసారాతో ఎస్‌ఈబీ సిబ్బంది

చింతలపూడి: చింతలపూడి ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో చింతలపూడి మండలం కంచనగూడెంలో నాటుసారా స్థావరంపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. గ్రామంలో నాటుసారా తయారుచేస్తున్న కేంద్రంపై దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి రూ.15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఏలూరు టౌన్: ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలోని పలు ప్రాంతాల్లో వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, ఎస్సైలు ఎస్.రామకృష్ణ, ఎస్‌కే మదీన బాషా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పాతబస్టాండ్ సెంటర్, వన్‌టౌన్ ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదుచేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, వేగం వద్దు.. ప్రాణం ముద్దు అనే నినాదంతో సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపటం నేరమన్నారు. మోటారు సైకిల్ ప్రయాణికులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

‘జగనన్న సురక్ష’ను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ప్రజలకు నెలరోజులపాటు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, మండల ప్రత్యేక అధికారి రమాదేవి, తహసీల్దార్ శారా శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏలో..

జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై పోలవరం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పాల్గొంటారని చెప్పారు. అలాగే ఏడు మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, ఐటీడీఏ శాఖ అధికారులు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొంటారని తెలిపారు.

జగనన్న సురక్షను ప్రజలకు చేరువ చేయాలి



లింగపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

లింగపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి, అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్ హౌస్ వద్ద పార్టీ మండల శ్రేణులు, ప్రజా ప్రతినిధులతో ఆయన చర్చించారు. జగనన్న సురక్ష కార్యక్రమ ప్రధాన ఉద్దేశాన్ని వివరించారు. ప్రధానంగా 11 రకాల సేవలు అందించనున్నట్టు చెప్పారు. నెల రోజులు పాటు జగనన్న సురక్ష కొనసాగుతుందన్నారు. అర్హులకు పథకాలు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 26 నుంచి లింగపాలెం మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ ఉపాధ్యక్షుడు దయ్యాల నవీన్ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండలపు సాయిబాబు, పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

1 నుంచి ‘జగనన్న సురక్ష’

కొయ్యలగూడెం: జగనన్న సురక్ష షెడ్యూల్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి ఎన్‌వీ రవిసాగర్ పేర్కొన్నారు. సీఎం జగన్ సురక్ష పథకం నిర్దేశాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓ ఆర్‌బీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో తహసీల్దార్ పాసం నాగమణి, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎంపీటీసీ గంట శ్రీనివాస్ తదితరులు వీక్షించారు.



పెద్దరావిగూడెంలో వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

అనంతరం జగనన్న సురక్ష షెడ్యూల్ విడుదల చేశారు. జూలై 1న మంగపతిదేవిపేట, 3న అచ్యుతాపురం, 4న వేదాంతపురం, 5న బయ్యన్నగూడెం, 6న సీతంపేట, 7న బయ్యన్నగూడెం, 10న పొంగుటూరు, 11న కన్నాపురం, 12న బోడిగూడెం, 13న రాజవరం, 14న కన్నాపురం, 15న యర్రంపేట, 17న రాజవరం, 18న పరింపూడి, 19న దిప్పాకాయలపాడు, 20న పరింపూడి, 21న యర్రంపేట, 22న రామానుజపురం, 24న పరింపూడి, 25న సరిపల్లి, 26న గవరవరం, 27న గవరవరం, 28న పరింపూడి గ్రామ సచివాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తారు.

పోలవరంలో..

పోలవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. జగనన్న సురక్ష విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ జి.శ్రీను, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

కుక్కునూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ప్రారంభోత్సవ ప్రసంగాన్ని శుక్రవారం మండలంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన టెలివిజన్లలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాముల వెంకటాచారి, అచంట మాధవరావు, పోలగాని రాంబాబులు సన్మానించారు. తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, ఎంపీడీఓ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి: జగనన్న సురక్ష కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ పిలుపునిచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా అధికారుల, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ రాంబాబు నాయక్, తహసీల్దార్ కృష్ణ జ్యోతి, ఎంపీడీఓ ఎం మురళీకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు, వ్యవసాయశాఖ ఏడీ నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి రాము, ఎంపీడీఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎలీజా



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం: చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావులను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎలీజా చైర్‌పర్సన్‌ను కోరారు. చింతలపూడి నియోజకవర్గంలో పలు రోడ్లు అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి చైర్‌పర్సన్ పద్మశ్రీ సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే ఎలీజా తెలిపారు.

జగనన్న సురక్షపై విస్తృత ప్రచారం చేయాలి



వేలేరుపాడులో జగనన్న సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఝాన్సీరాణి

వేలేరుపాడు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజల అవసరాలకనుగుణంగా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మూర్తి, తహసీల్దార్ రమేష్, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, వైస్‌ఎంపీపీ కేసగాని వెంకటేశ్వరమ్మ, మేడవరపు నాగశ్రీ, ఎంపీటీసీలు కొమ్మరాజు రాంబాబు, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, పిట్టా ప్రసాద్, విజయ, వీఆర్వోలు, పార్టీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి

- ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- ఆణిముత్యాల పురస్కారాల అందజేత



జంగారెడ్డిగూడెంలో జగనన్న ఆణిముత్యాలను సత్కరించిన ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని, అందుకే ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన చింతలపూడి నియోజకవర్గ స్థాయి 10వ తరగతి, ఇంటర్మీడియేట్ ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి వేల కోట్ల రూపాయాలు వెచ్చించి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని, అమ్మఒడి పథకం ద్వారా డ్రాపవుట్స్ లేకుండా చర్యలు చేపట్టారని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంలో రోజుకో మెనూతో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారని తెలిపారు. నాడు - నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి బైజూస్ సాఫ్ట్‌వేర్ ద్వారా గ్లోబల్ ఎడ్యుకేషన్‌కు శ్రీకారం చుట్టారని, త్వరలో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేసి ప్రాక్టికల్‌గా చూపిస్తూ విద్యాబోధన చేయనున్నారని వివరించారు. చింతలపూడి మండలం చింతంపల్లిలో పామాయిల్ రిఫైనరీ రూ.100 కోట్లతో ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. చింతలపూడిలో 100 పడకల ఆసుపత్రి, జంగారెడ్డిగూడెంలో మాతా శిశు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పోల్నాటి బాబ్జి, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, జిల్లా యూత్ కమిటీ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, గురజాల పార్థసారథి, వైస్ చైర్మన్లు కంచర్ల వాసవీ రత్నం, ముప్పిడి అంజి, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, వామిశెట్టి హరిబాబు, బత్తిన చిన్న, ఎంఈఓలు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఆణిముత్యాలు వీరే:

ఇంటర్మీడియేట్ : తాళ్లూరి ఈశ్వర్ నాగ మహేంద్ర (ఎస్‌డీఎస్ జీజేసీ, జంగారెడ్డిగూడెం), కె.గ్లోరీ జాస్మిన్ (జీజేసీ, చింతలపూడి), కుంజా దుర్గాభవాని, మేకల లావణ్య (ఎస్‌డీఎస్ జీజేసీ, జంగారెడ్డిగూడెం).

10వ తరగతి : టి.సౌజన్య (ఏపీఆర్‌జీహెచ్‌ఎస్, నాగిరెడ్డిగూడెం), ఎ.జయస్పందన (జెడ్పీపీ హైస్కూల్, రాఘవాపురం), పి.కుసుమ (ఏపీఆర్ జీహెచ్‌ఎస్, నాగిరెడ్డిగూడెం), ఎం.పార్థవి (జెడ్పీపీ హైస్కూల్, రాఘవాపురం). వీరందరికీ నగదు ప్రోత్సాహకాలు, మెడల్, ప్రశంసాపత్రం ఎమ్మెల్యే ఎలీజా చేతుల మీదుగా అందజేశారు.

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు



దివ్యాంగులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం: ప్రభుత్వం కల్పిస్తోన్న సదుపాయాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన దివ్యాంగుల నమోదు శిబిరాన్ని ఆమె సందర్శించారు. త్వరలోనే మరో క్యాంపు నిర్వహించి దివ్యాంగులకు అవసరమైన పరికరాలు ఉచితంగా అందిస్తామని చెప్పారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆడియోలజీ, సైకాలజీ, ఫిజియోథెరఫి, పీవోయూడిఐడీ, సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శిబిరంలో 55 మంది దివ్యాంగులు తమ పేర్లు వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీడీఓ ఆర్.బేబీ శ్రీలక్ష్మి, జిల్లా దివ్యాంగుల పునరవాస కేంద్ర సిబ్బంది కె.నాగరాజు, మొబిలిటి ట్రైనర్ కంబయ్య, జయలక్ష్మీ, ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు, స్పెషల్ ఎడ్యుకేటర్ రష్మిత, సీనియర్ అసిస్టెంట్ ఎ.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో లోవోల్టేజ్ సమస్య

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీ వెంకటాపురం ఎస్సీ కాలనీ వాసులను గత కొంతకాలంగా లోవోల్టేజ్ సమస్య వేదిస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోవోల్టేజ్ కారణంగా టీవీ, ఫ్యాన్ వంటి ఎలక్ట్రికల్ గృహోపకరణాలు సరిగా పనిచేయడంలేదని చెబుతున్నారు. మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. ఇకనైనా విద్యుత్‌శాఖాధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మెట్టగూడెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాగూడెం మండలం ఎన్‌ఆర్‌పాలెం సచివాలయ పరిధిలోని మెట్టగూడెం, చంద్రాయిగూడెం గ్రామాల్లో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను బాలరాజు ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి రావడంతో వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయా శాఖల అధికారులు ఆదేశించారు. మారుమూల కొండ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు సైతం పథకాలు అందే విధంగా, గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి, గిరిజన గ్రామంలో మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ ప్రజారంజక పాలన చేస్తుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్ రవ్వా చంద్రకళ, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, బానోతు బాబూరావు, బానోతు కృష్ణ నాయక్, బానోతు శ్రీరామ్‌మూర్తి, రవ్వా నాగు, మండల సచివాలయాల కన్వీనర్ తెల్లం సింహాచలం, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి పద్మజ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ అలీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజర్‌పై ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

వేలేరుపాడు: ప్రజా ప్రతినిధులంటే అంత అలుసా? మండలంలో ప్రజా ప్రతినిధులంతా సమయానికి సమావేశానికి హాజరైనా.. అధికారులు హాజరుకాక పోవడంపై సభ్యులు మండిపడ్డారు. ఇక్కడి ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మూడు నాలుగు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజర్ అవుతుండటంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల ముందు ఏదో మొక్కుబడిగా మాట్లాడి సభ ముగించడం పరిపాటయిందని, అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలని సభ్యులు కోరారు. ముఖ్యంగా గోదావరి వరద సమయంలో అప్రమత్తంగా ఉండాలని, జగనన్న సురక్ష పథకం గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మూర్తి, తహసీల్దార్ రమేష్, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, వైస్ ఎంపీపీ కేసగాని వెంకటేశ్వరమ్మ, మేడవరపు నాగశ్రీ, ఎంపీటీసీలు కొమ్మరాజు రాంబాబు, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, పిట్టా ప్రసాద్, విజయ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



వరి, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

బుట్టాయగూడెం: ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోన్న పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా మండలంలోని దుద్దుకూరులో రైతులకు పంపిణీ చేశారు. బాలరాజు మాట్లాడుతూ రైతుల వ్యవసాయాభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఏఓ బి.సుమలత మాట్లాడుతూ జీలుగు 149 కింటాలు, జనుము 229, పిల్లిపెసర 38 కింటాలు, వరి విత్తనాలు బీపీటీ 52.04 రకం 150 కింటాలు, ఎంటీయూ రకాలు 200 కింటాలు, ఆర్బీకేలో అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. కంది విత్తనాలు 100 శాతం రాయితీపై అందిస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ కారం శాంతి పాల్గొన్నారు.

25న జలాభిషేకం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మవారి ఆలయంలో ఈ నెల 25న అమ్మవారికి జలాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వేణుగోపాలాచార్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు నిర్వహించే జలాభిషేకంలో భక్తులంతా పాల్గొనాలని పేర్కొన్నారు.

విద్యుత్ అధికారులకు అదనపు విధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు, పరిపాలన సౌలభ్యం కోసం అసిస్టెంట్ ఇంజినీర్లు లేని ప్రాంతాల్లో డిప్యూటీ ఈఈలకు అదనపు విధులు కేటాయిస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గోపాలపురం డిప్యూటీ ఈఈకి గోపాలపురం సెక్షన్, పెనుగొండ డిప్యూటీ ఈఈ ఎం.నిరంజన్ బాబుకు పెనుగొండ సెక్షన్, కామవరపుకోట డిప్యూటీ ఈఈ కె.శ్రీనివాసరావుకు కామవరపుకోట సెక్షన్, జంగారెడ్డిగూడెం డిప్యూటీ ఈఈ యు.సుబ్బారావుకు జంగారెడ్డిగూడెం సెక్షన్, జీలుగుమిల్లి డిప్యూటీ ఈఈ టి.వెంకటరావుకు దర్భగూడెం సెక్షన్ ఇన్‌చార్జీలుగా విధులు కేటాయించారు. పాలకొల్లు డిప్యూటీ ఈఈ ఆర్ నాగేశ్వరరావుకు ఆచంట, నల్లజర్ల డిప్యూటీ ఈఈ డి.రాజబాబుకు నల్లజర్ల, భీమడోలు డిప్యూటీ ఈఈ కె.గోపాలకృష్ణకు ఎం.నాగులపల్లి సెక్షన్ ఇన్‌చార్జిలుగా అదనపు విధులు కేటాయించారు. ఏలూరు సర్కిల్ కార్యాలయంలో ఏఈఈగా పని చేస్తున్న ఎస్ పద్మినిని ఏలూరు పవర్‌పేట ఏఈఈగా, పవర్‌పేట ఏఈగా పని చేస్తున్న కె.వెంకటేశ్వరరావును ఏలూరు నార్త్ సెక్షన్ ఏఈగా బదిలీ చేశారు. ఏలూరు కమర్షియల్-1 డివిజన్ కార్యాలయంలో ఏఈగా పని చేస్తున్న ఆర్.భీమేశ్వరరావును ఎం.నాగులపల్లికి బదిలీ చేసి ఏలూరులో ఆయన చేస్తున్న పాత విధుల్లోనే పని చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు భీమవరం డీపీఈ-2 ఏఈగా పని చేస్తున్న టి.పెద్దిరాజును గత 8 నెలల నుంచి ఖాళీగా ఉన్న తణుకు రూరల్ ఏఈ స్థానానికి బదిలీ చేశారు.